రబీ సాగుకు ఎరువుల యాజమాన్య పద్ధతులు

- అధిక దిగుబడికి అవకాశం
- 35,500 ఎకరాల్లో సాగు


పెరవలిలో దాళ్వా వరి చేనుకు ఎరువులు వేస్తున్న రైతు

పెరవలి: రబీ పంట మొనలు తిరగడంతో మొదటి దఫా ఎరువులను రైతులు పంట చేలకు వేస్తున్నారు. మండలంలోని 18 గ్రామాల్లో నాట్లు 95 శాతం పూర్తవ్వడంతో, మొదటి కోటా ఎరువులను చేలకు అందిస్తున్నారు. వ్యవసాయాధికారులు కూడా వరినాట్లు వేసిన 25 రోజులకు మొదటి దఫా ఎరువులు అందించాలని సూచనలు ఇవ్వడంతో రైతులు ఇందుకు సన్నద్ధమయ్యారు. నిడదవోలు నియోజకవర్గంలో మొత్తం 35,500 ఎకరాల్లో రబీ సాగు జరుగుతుండగా, ఇందులో పెరవలి మండలంలో 8500, నిడదవోలులో 15,500, ఉండ్రాజవరం మండలంలో 11,500 ఎకరాల్లోను సాగు చేస్తున్నారు. నియోజకవర్గంలో వరినాట్లు 98 శాతం పూర్తవ్వగా, కొన్ని గ్రామాల్లో ఇప్పటికే రెండో దఫా ఎరువులను కూడా పూర్తి చేశారు. ఉసులుమర్రు, కానూరు, కానూరు అగ్రహారం, నడిపల్లి గ్రామాల్లో ముందస్తుగా నాట్లు వేయడం, ఈ పంటలన్నీ విత్తనాల కోసం సాగు చేయడంతో రెండో కోటా ఎరువులను అందించారు.

సక్రమంగా సాగు నీరందితే..

సాగునీరు సక్రమంగా అందితే రబీ పంటను రైతులందరూ దక్కించుకుంటారని పలువురు చెబుతుండగా, అధికారులు మాత్రం ప్రతి చేనుకు నీరందించేందుకు ప్రణాళికలు రూపొందించి నీటి కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం సాగు నీటికి ఇబ్బందులు లేవని అధికారులు చెబుతున్నారు. రబీ పంటకు ఎరువులను ఎంత మోతాదులో వేయాలి, ఏ సమయంలో పంటకు అందించాలి రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలను పెరవలి వ్యవసాయాదికారి మేరీ కిరణ్ వివరించారు. రబీ పంటలో రైతులు ఎంటీయూ 1010, ఎంటీయూ 1156, ఎంటీయూ 1121 రకాలను సాగు చేస్తున్నారని చెప్పారు.

ఎకరానికి 72 కిలోల నత్రజని, 24 కిలోల భాస్వరం, 16 కిలోల పొటాష్‌ను మూడు దఫాలుగా పంటకు అందించాలి. ఈ ఎరువులను మొదటి దఫా ఆఖరి దమ్ములో కానీ, లేక నాటిన 7 రోజుల లోపు కానీ వేయాలి, రెండో దఫా నాటిన 25 రోజులకు, మూడో దఫా 45 రోజులకు ఎరువులను వేయాలి. ఎరువులను బస్తాల రూపంలో అయితే ఇలా అందించాలి. ఈ ఎరువులతో పాటు, రబీ సీజన్‌లో జింక్ లోపం ఎక్కువగా ఉంటుంది. అందుకు ఎకరానికి 20 కిలోల జింక్ సల్ఫేట్‌ను వేయాలి.

7న లక్ష డప్పులు, వేల గొంతుల సభ

ఉండ్రాజవరం: మందకృష్ణ మాదిగ నాయకత్వంలో వచ్చేనెల ఏడో తేదీన హైదరాబాద్‌లో జరిగే లక్ష డప్పులు, వేల గొంతులు సన్నాహక సభకు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లాల ఇన్‌చార్జి బయ్యారపు రాజేశ్వరరావు కోరారు. ఉండ్రాజవరంలో మాదిగ పోరాట సమితి మండల సమావేశం సోమవారం మండల అధ్యక్షుడు సునీల్ రాజ్ బొల్లిపో ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు దిద్దే మధుబాబు, నియోజకవర్గ ఇన్‌చార్జి గాలింకి రాము, ఎమ్మార్పీఎస్ మండల ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్, గాలింకి సంతోష్, చదలవాడ నాని, మండల ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ వెంకట్రావు

తాళ్లపూడి: పెద్దేవం గ్రామ పంచాయతీ పరిధిలోని ఆక్రమణలు తొలగించడంలో గ్రామస్తులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహకరించాలని సర్పంచ్ తిగిరిపల్లి వెంకట్రావు కోరారు. మండలంలోని పెద్దేవం గ్రామ పంచాయతీలో సోమవారం వార్డు సభ్యులతో జనరల్‌బాడీ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ తోట రామకృష్ణ మాట్లాడుతూ ఇటీవల 5వ వార్డులో రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలు తొలగించి, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం పూర్తి చేశామన్నారు. దీంతో ఆ ప్రాంతంలో దీర్ఘకాలికంగా ఉన్న సమస్య తీరిందన్నారు. అలాగే గ్రామంలోని అన్ని ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. గ్రామస్తులు స్వచ్ఛందంగా అడ్డుగా ఉన్న చెట్లు, ఆక్రమణలు తొలగించాలన్నారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శి పి.సాంబమూర్తి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

మండల కేంద్రాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకట్రాజు

దేవరపల్లి: నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ కేంద్రాల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు తెలిపారు. వీటికి దాతల సహకారంతో భవనాలు నిర్మిస్తామని చెప్పారు. స్థానిక బంగారు పాపమ్మ తల్లి ఆలయం వద్ద సోమవారం జరిగిన మండల ఎలక్ట్రీషియన్స్, ప్లంబర్స్ యూనియన్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, టెక్నికల్ వర్కర్లు రక్షణ పరికరాలను వినియోగించాలని, జీవిత బీమా చేయించుకోవాలని సూచించారు. యూనియన్ భవన నిర్మాణానికి అవసరమైన స్థల సేకరణకు కృషి చేస్తానని తెలిపారు. అంతవరకూ అవసరమైతే ఇరిగేషన్ భూమిలో తాత్కాలికంగా షెడ్డు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పుష్కరాల పనుల్లో ఎలక్ట్రీషియన్లను భాగస్వాములను చేస్తామని చెప్పారు. తొలుత బంగారు పాపమ్మను ఎమ్మెల్యే దర్శించుకున్నారు.

రెవెన్యూ అధికారికి సత్కారం


రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బీరా సత్యేంద్రకుమార్‌ను సత్కరిస్తున్న కేవీపీఎస్ నాయకులు

నిడదవోలు: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న బీరా సత్యేంద్రకుమార్ గణతంత్ర దినోత్సవం సందర్భంగా కలెక్టర్ పి.ప్రశాంతి చేతుల మీదుగా ఉత్తమ సేవా అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ నాయకుల ఆధ్వర్యంలో ఆయనను ఆర్ఐ సత్యేంద్రను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు జువ్వల రాంబాబు, మాజీ ఎంపీపీ మన్యం సూరిబాబు, బీటీఏ రాష్ట్ర కార్యదర్శి నేతల విజయ్‌కుమార్, భయ్యే మునింద్ర, నేంద్ర మత్తి అర్జునుడు, అక్కబత్తుల క్రిస్టియన్‌రావు, పి.చినబాబు, వీఆర్వో ఆయినపర్తి శ్రీనివాస్, మెంటే వెంకటేశ్వరరావు, కురసాల పురుషోత్తం, వి.ప్రభాకర్, కే సురేష్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గోలింగేశ్వరునికి లక్షపత్రి పూజలు


పూజలు అందుకున్న స్వామివారు

నిడదవోలు: స్థానిక రాజరాజేశ్వరి సమేత గోలింగేశ్వరస్వామి వారి ఆలయంలో మాస శివరాత్రి సందర్భంగా ఆదివారం స్వామివారికి లక్షపత్రి పూజ వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామివారికి గణపతి పూజలు, ఉపన్యాస, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి పూజలు చేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు శ్రీకాకులపు లక్ష్మీనరసింహశాస్త్రీ, ఆలయ ఈవో సోమాల శివ, అభిరాబ్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గా మల్లేశ్వరస్వామికి అభిషేకాలు

ఉండ్రాజవరం: కె.సావరం గ్రామంలోని శ్రీదుర్గా మల్లేశ్వరస్వామికి సోమవారం మాస శివరాత్రి సందర్భంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వి.హరి శంకర్ ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకాలు చేసి, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులు స్వామి వారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అంగన్‌వాడీ కిచెన్ గార్డెన్ పరిశీలన


కిచెన్ గార్డెన్‌ను పరిశీలిస్తున్న సర్పంచ్ మల్లిక, ఏసీడీపీఓ పద్మావతి

నల్లజర్ల: పంటల సాగులో రసాయన ఎరువులు, పురుగు మందుల్ని విచక్షణారహితంగా వాడటంతో గాలి, నీరు, తిండి కలుషితమవుతున్నాయని సర్పంచ్ గాలింకి మల్లిక అన్నారు. ఈ ఆహార ఉత్పత్తులు దీర్ఘకాలిక వ్యాధులకు కారణమవుతున్నాయని, వీటి నుంచి చిన్నారులు, బాలింతలు, గర్భిణులను రక్షించేందుకు చీపుగూడెంలోని 55, 56 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేశామని చెప్పారు. ఇక్కడ వివిధ రకాల ఆకుకూరలు, కూరగాయలు పండించే ఏర్పాటు చేశామన్నారు. ఈ కిచెన్ గార్డెన్‌ను ఐసీడీఎస్ ఏసీడీపీఓ పద్మావతితో కలసి సర్పంచ్ మల్లిక సోమవారం పరిశీలించారు. పద్మావతి మాట్లాడుతూ, గర్భిణులు ఆకుకూరలు, కూరగాయలు తీసుకోవడం ద్వారా వైకల్యంతో కూడిన పిల్లలు జన్మించకుండా నివారించవచ్చని అన్నారు. బాలల్లో దివ్యాంగులను గుర్తించి, వారిలో శారీరక, మానసిక లోపాలను తగ్గించేందుకు సమీప భవిత కేంద్రాలకు పంపేలా తల్లిదండ్రులకు అవగాహన కలిగించాలని సూచించారు. బాలింతలు, గర్భిణులకు ఆకుకూరలు అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు సుశీల, కుమారి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వసతి గృహాల పరిశీలన


గౌరీపట్నంలో శిథిలావస్థకు చేరిన బాలుర వసతి గృహాన్ని పరిశీలిస్తున్న డీడీ శోభారాణి

దేవరపల్లి: నియోజకవర్గంలోని దేవరపల్లి, గోపాలపురం, నల్లజర్ల మండలాల్లోని 10 సాంఘిక సంక్షేమ వసతి గృహాలను ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎంఎస్ శోభారాణి సోమవారం పరిశీలించారు. రూ.1.44 కోట్లతో వీటి భవనాల మరమ్మతులు, మౌలిక వసతుల కల్పన పనులు చేపట్టనున్నారు. ప్రస్తుతం ఈ పనులు టెండర్ల దశలో ఉన్నాయి. దేవరపల్లి మండలంలో 6 వసతి గృహాలకు రూ.93.71 లక్షలు, గోపాలపురం మండలంలో మూడింటికి రూ.43.78 లక్షలు, నల్లజర్ల మండలంలోని ఒక వసతి గృహానికి రూ.7.35 లక్షల చొప్పున మంజూరయ్యాయి. ఈ నేపథ్యంలో ఆయా వసతి గృహాలను డీడీ శోభారాణి పరిశీలించారు. ఆమె వెంట ఏఎస్‌డబ్ల్యూఓ ఆర్‌వీ శ్రీనివాస్, వసతి గృహాల సంక్షేమాధికారులు, సిబ్బంది ఉన్నారు.

గోపాలపురం: పెద్దగూడెంలో శిథిలావస్థకు చేరిన ఎస్సీ బాలుర వసతి గృహాన్ని శోభారాణి పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, మండలంలోని రేగులగుంట, గోపాలపురం, రాజంపాలెం బాలుర వసతి గృహాల మరమ్మతులకు రూ.43 లక్షలతో ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు.

ఉత్తమ సేవా అవార్డు గ్రహీతలకు సత్కారం


తాళ్లపూడిలో సేవా పురస్కారాలు పొందిన ఎంపీడీవో, ఏఎస్‌వోలను సత్కరిస్తున్న అధికారులు

తాళ్లపూడి: మండల స్థాయిలో ఉత్తమ సేవలు అందించిన అధికారులకు సైతం వచ్చే ఏడాది నుంచి అవార్డులు అందిస్తామని ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం రిపబ్లిక్ డే సందర్భంగా జిల్లా కలెక్టర్ నుంచి ఉత్తమ సేవా పురస్కారాలు పొందిన తాళ్లపూడి ఎంపీడీఓ టీబీ వెంకట రమణ, మండల ఏఎస్‌వో జె.వెంకటేశ్వరరావులకు అభినందన సభ ఏర్పాటు చేశారు. ఎంపీడీఓ వెంకట రమణ, మండల ఏఎస్‌వో వెంకటేశ్వరరావులను పూలమాల, శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.రవీంద్రనాథ్, ఈవోపీర్డీ కేఎస్ వీరన్న, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ షేక్‌సూర్జాన్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఎలక్ట్రీషియన్ డే


తాళ్లపూడిలో థామస్ అల్వా ఎడిషన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సంఘ సభ్యులు

తాళ్లపూడి: ఎలక్ట్రీషియన్ డే రోజు ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని మండల ఎలక్ట్రీషియన్ సంఘం అధ్యక్షుడు ఎలుబోలు శ్రీనివాస్ కోరారు. తాళ్లపూడిలో సోమవారం ఎలక్ట్రీషియన్ దినోత్సవం నిర్వహించారు. తొలుత థామస్ అల్వా ఎడిషన్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల ఎలక్ట్రీషియన్ అండ్ ప్లంబర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. సంఘ సభ్యులకు లైఫ్, ఆరోగ్య ఇన్సురెన్స్ చేయించాలని కోరారు. సంఘం సభ్యులు గుమ్మడి చంద్రశేఖర్, శీలబోయిన శ్రీనివాస్, భీమరాజు పాల్గొన్నారు.

కొవ్వూరు: జీవనోపాధి కోసం ఎలక్ట్రీషియన్ వృత్తిని ఎంచుకుని ప్రమాదకరమైన పరిస్థితులను అధిగమించడం అభినందనీయమని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. పట్టణంలోని ఎన్‌టీఆర్ క్రీడా ప్రాంగణంలో సోమవారం ఎలక్ట్రీషియన్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ బల్బు కనిపెట్టిన థామస్ ఆల్వా ఎడిషన్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీనియర్ ఎలక్ట్రీషియన్‌లను శాలువాతో సత్కరించారు. మాజీ మునిసిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని, కొవ్వూరు ఎలక్ట్రికల్ అండ్ ప్లంబర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రొంగల హరీష్ కుమార్, గౌరవ అధ్యక్షుడు ఎస్‌పీ వెంకన్న, గౌరవ సలహాదారుడు జాగారపు వీరబాబు,ఉపాధ్యక్షుడు జమ్ము సూరిబాబు, కారదర్శి వాడ శ్రీగణేష్ తదితరులు పాల్గొన్నారు.

ధన్యజీవి పుల్లయ్య మాస్టారు

నల్లజర్ల: అనేక మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దిన ధన్యజీవి పుల్లయ్య మాస్టారు అని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు కొనియాడారు. అచ్చన్నపాలేనికి చెందిన నెక్కలపూడి పుల్లయ్య (94)ఇటీవల మృతి చెందారు. ఆయన దశదిన కార్యక్రమం సందర్భంగా రిటైర్డు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన సంతాప సభలో ఎమ్మెల్యే హాజరై పుల్లయ్య మాస్టారు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘ అధ్యక్షుడు ఐవీ సత్యం, ప్రధాన కార్యదర్శి ఉన్నమట్ల వెంకటేశ్వరరావు, జిల్లా సహాధ్యక్షుడు ఎస్‌ఎం ఆలీసాహెబ్, ఉద్యమ నాయకుడు చెరుకూరి సుభాస్‌చంద్రబోస్ పాల్గొన్నారు.

నేడు చాగల్లులో లేగ దూడల ప్రదర్శన

చాగల్లు: పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో చాగల్లు పశువైద్యశాల వద్ద మంగళవారం లేగ దూడల ప్రదర్శన నిర్వహించనున్నట్టు పశువైద్యాధికారి ముకేష్ సోమవారం తెలిపారు. ఉదయం 9 గంటలకు లేగ దూడల ప్రదర్శన, అనంతరం పశువుల పెంపకంపై రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశామన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

2 నుంచి షిర్డీసాయి ఆలయ వార్షికోత్సవాలు

కొవ్వూరు: గోష్పాద క్షేత్రంలోని షిర్డీసాయినాథ్ ఆలయ వార్షికోత్సలను వచ్చే నెల 2వ తేదీ నుంచి నాలుగో తేదీ వరకూ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సోమవారం తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా 2న ఉదయం సాయి సచ్చరిత పారాయణ, మహా గణపతి హోమం, మధ్యాహ్నం 3 గంటలకు హనుమాన్ చాలీసా పారాయణ, రాత్రి ఆరు గంటల నుంచి కూచిపూడి నృత్యప్రదర్శన నిర్వహిస్తామన్నారు. 3న ఉదయం బాబా వారికి ఏకాదశ రుద్రాభిషేకాలు, మధ్యాహ్నం సంపూర్ణ భగవద్గీత పారాయణ, సాయంత్రం భక్తి సంగీత విభావరీ, 4న సామూహిక విష్ణు సహస్ర పారాయణ, ఉదయం 11 గంటలకు నిడదవోలు సత్యనారాయణ మూర్తి బృందంతో సంకీర్తన కార్యక్రమం, మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో మహాఅన్నదానం నిర్వహిస్తామని వివరించారు.

సీ క్లాస్ లంక భూముల వారసులకు న్యాయం చేస్తాం

- జిల్లా కలెక్టర్ ప్రశాంతి
- గోదావరి లంకలో పట్టా భూముల పరిశీలన


కాకరపర్రులో లంకభూములను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, జాయింట్ కలెక్టర్, అధికారులు

పెరవలి: లంకలో సీ కాస్ పట్టా భూమి ఉన్న వారసులకు తప్పకుండా న్యాయం చేస్తామని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. కాకరపర్రులోని గోదావరి లంకలో సీ క్లాస్ పట్టా భూములను సోమవారం ఆమె పరిశీలించారు. జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల ప్రజావేదికలో కాకరపర్రు గ్రామానికి చెందిన లంక రైతులు ఇచ్చిన ఫిర్యాదుపై ఆమె లంకలను పరిశీలించారు. ఈ ఫిర్యాదులో లంక సీ క్లాస్ భూములకు పట్టాలు ఇచ్చారు కానీ లబ్దిదారులు బతికి లేరని, వాళ్ల వారసులకు పట్టాలు ఇవ్వాలని అర్జీ అందించారు. దీంతో ఆమె అక్కడ పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. లంకలో సర్వే నంబర్ 60, 61 తదితర సర్వే నంబర్లలో 318 మందికి గతంలో పట్టాలు ఇవ్వగా ఇందులో సమస్యలు ఉన్న 48 మందికి పట్టాలు ఇవ్వలేదని, మిగిలిన 270 మందికి ఇవ్వవచ్చని తహసీల్దార్ తెలిపారు. దీనిపై స్వయంగా లంక భూములను పరిశీలించడానికి ఆమె విచ్చేసి లబ్దిదారులతో మాట్లాడి మీకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ సంబంధించిన పట్టా భూముల వారసుల వివరాలతో సమగ్ర నివేదిక అందజేయాలని తహసీల్దార్, సర్వేయర్‌లను ఆదేశించారు. కలెక్టర్ వెంట జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్న రాముడు, జిల్లా మైన్స్ అధికారి డి.ఫణి భూషణ్, జిల్లా సర్వే అధికారి బి.లక్ష్మీనారాయణ, తహసీల్దార్ డి.అచ్యుతకుమారి, మండల సర్వేయర్, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

- అధికారులకు ఎమ్మెల్యే ఆదేశం
- వాడీవేడిగా కౌన్సిల్ సమావేశం
- రూ.4.90 కోట్ల మిగులుతో మున్సిపల్ బడ్జెట్ ఆమోదం


సమావేశానికి హాజరైన సభ్యులు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు, చైర్‌పర్సన్ రత్నకుమారి

కొవ్వూరు: పురపాలక సంఘంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ఆదేశించారు. స్థానిక పురపాలక సంఘం కార్యాలయంలో సోమవారం చైర్‌పర్సన్ బావన రత్నకుమారి అధ్యక్షతన బడ్జెట్, సాధారణ సమావేశాలు నిర్వహించారు. ఎక్స్ అఫిషియో సభ్యుడిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరాకు స్వస్తి పలకాలని సూచించారు. తాగునీరు, పారిశుద్ధ్యం, వీధిలైట్లు నిర్వహణకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. పట్టణంలో దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

అజెండాలో 42 అంశాలు

పట్టణంలోని 42 అంశాలతో అజెండా రూపొందించారు. 39వ అంశామైన ఆశీల వసూళ్లలో మార్పులు, చేర్పుల అంశాన్ని వాయిదా వేశారు. మిగిలిన అన్నీ అంశాలకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. అనుబంధ అజెండాలో పేర్కొన్న రెండు అంశాలను కౌన్సిల్ ఆమోదించింది. పట్టణంలో ఇళ్ల నిర్మాణానికి రూ.2.50 లక్షలు ప్రభుత్వం అందిస్తోందని ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు ప్రకటించారు. మున్సిపాలిటీలో 250 ఇళ్ల నిర్మాణానికి అధికారులు గుర్తించారన్నారు. వైస్ చైర్ పర్సన్‌లు మన్నె పద్మ, గంగ్రోతు అంజనీ దేవి, అధికారులు పాల్గొన్నారు.

రోడ్ల విస్తరణపై ప్రజల్లో ఆందోళన

పట్టణంలో రోడ్ల విస్తరణ చేపడతారని ప్రజలు ఆందోళన చెందుతున్నారని, ఇప్పుడు ఆ అవసరం ఎందుకు వచ్చిందో ప్రజలకు వివరించాల్సి ఉందని సీనియర్ సభ్యుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ కోడూరి శివరామకృష్ణ ప్రశ్నించారు. దీనిపై కమిషనర్ టి.నాగేంద్రకుమార్ మాట్లాడుతూ తాత్కాలికంగా విస్తరణ అనేది లేదన్నారు. ప్లాన్ అప్రూవల్ కోసం 30 అడుగుల కంటే రోడ్డు తక్కువ ఉంటే మునిసిపాలిటీకి 30 అడుగులు రాసి ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం జారీ చేసిన 168 జీవో ప్రకారం 12 అడుగుల రోడ్డు ఉంటే అప్రూవల్ లభిస్తుందని తెలిపారు. ప్రజల్లో అపోహలు తొలగించాలని శివరామకృష్ణ కోరారు. పట్టణంలో పలు అంశాలపై సభ్యులు చర్చించారు.

బడ్జెట్ ఆమోదం

పురపాలక సంఘం 2025-26లో వార్షిక బడ్జెట్‌ను సభ్యులు ఆమోదించారు. రూ.9,03,89,818 ప్రారంభ నిల్వతో ఈ ఆర్థిక సంవత్సరం వివిధ గ్రాంట్‌లు, నిధులు కలిపి రూ.15,68,88,000 రాబడి వస్తుందని, దీనిలో రూ.19,82,35,000 ఖర్చు అవుతుందని అంచనా వేశారు. రూ.4,90,42,818 మిగులు అంచనాలతో బడ్జెట్‌ను ఆమోదించారు. పలు శాఖల అధికారులు, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

సమరయోధుల సేవలు స్ఫూర్తిదాయకం


సమిశ్రగూడెంలో పోలీస్, రైతులు, పాస్టర్లను సన్మానిస్తున్న సంఘ విశ్వాసులు

నిడదవోలు రూరల్: స్వాతంత్ర్య సమరయోధుల సేవలు యువతకు స్ఫూర్తిదాయకమని ఏఎస్సై ఆంజనేయులు సూచించారు. సమిశ్రగూడెం యేసు నాకాపరి ప్రార్థన మందిరంలో జై జవాన్-జై కిసాన్ సన్మాన కార్యక్రమాలను ఆదివారం రాత్రి నిర్వహించారు. ఏఎస్సై ఆంజనేయులు, పోలీస్ కానిస్టేబుల్ ఏడు కొండలు, రిటైర్డ్ ఆర్మీ బొచ్చా కృష్ణ, రైతులు గోగిన శ్రీనివాసరావు, సిరికోటి వీరభద్రరావులను సన్మానించారు.

జవాబుదారీతనంతో పనిచేయండి

- అధికారులకు జిల్లా కలెక్టర్ ప్రశాంతి ఆదేశం
- కొవ్వూరులో డివిజన్‌స్థాయి పీజీఆర్ఎస్ కార్యక్రమం


కొవ్వూరులో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి, జేసీ చిన్నరాముడు

కొవ్వూరు: ప్రజాసమస్యలు పరిష్కారంలో అధికారులు జవాబుదారీ తనంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సూచించారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం డివిజన్ స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ స్వయంగా ప్రజా సమస్యలు తెలుసుకుని, ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రతి ఒక్క అర్జీకి నాణ్యతతో కూడిన శాశ్వత పరిష్కారం చేయాలని అధికారులను ఆదేశించారు. పీజీఆర్ఎస్ కార్యక్రమంలో 30 అర్జీలు స్వీకరించారు. మండల స్థాయి అధికారులంతా ఒకే వేదికపై ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలు పరిష్కరించే దిశగా కృషి చేయాలని సూచించారు. వినతుల పరిష్కారం పెండింగ్‌లో లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అర్జీదారులు సంతృప్తి చెందే విధంగా అర్జీలను పరిష్కరించి పీజీఆర్ఎస్ కార్యక్రమంపై ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు మాట్లాడుతూ ప్రతి అర్జీని నిర్దిష్టమైన కాల పరిమితి లోపు పరిష్కారించాలని సూచించారు. సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ బి.లక్ష్మీనారాయణ, ఆర్డీవో రాణి సుస్మిత, డీఎస్పీ జి.దేవకుమార్, డీఎల్‌డీవో స్లీవారెడ్డి, డివిజన్, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఎంఈఓ-2 భగవతికి అభినందనలు


ఉత్తమ ఎంఈఓగా కలెక్టర్ ప్రశాంతి చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న ఎంఈఓ-2 భగవతి

నల్లజర్ల: మండలంలో మూడేళ్లుగా విద్యా ప్రగతికి విశేష కృషి చేసినందుకుగాను రాష్ట్ర ప్రభుత్వం ఎంఈఓ-2 భగవతికి ఉత్తమ ఎంఈఓగా అవార్డు అందించింది. ఈ మేరకు ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన రిపబ్లిక్ డే వేడుకల్లో కలెక్టర్ పి.ప్రశాంతి చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు. భగవతిని విద్యాశాఖ సిబ్బందితో పాటు వివిధ శాఖల అధికారులు, ఎంపీపీ బంక జయలక్ష్మి అప్పారావు, జెడ్పీటీసీ ముప్పిడి లక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెల్లంకి వెంకటసుబ్రహ్మణ్యం తదితరులు అభినందించారు. 14 ఏళ్లుగా విద్యా శాఖలో పోతవరం క్లస్టర్ రిసోర్స్ పర్సన్‌గా పనిచేస్తున్న నూతంగి శ్రీనివాసరావును ఉత్తమ క్లస్టర్ రిసోర్స్ పర్సన్‌గా గుర్తించి రిపబ్లిక్ డే వేడుకల్లో సమగ్రశిక్షా ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ సుభాషిణి చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందజేశారు.